ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 25 నవంబరు 2024 | 5

కార్మిక నాయకుడు గల్లా రాము మృతి

... వివరాలు 7లో

సందడే సందడి


అంతర్వేది సముద్ర తీరంలో సందర్శకుల సందడి

తీరమంతా...

అంతర్వేది సాగర సంగమ తీరం ఆదివారం భక్తులు, పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సరుగుడు తోటల్లో విందు భోజనాలు ఆరగించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ సంస్థల ప్రతినిధులు సందడి చేశారు. అల్లవరం మండలం మండలం ఓడలరేవు సముద్ర తీరం ఆదివారం సందర్శకులు సందడి చేశారు. కుటుంబ సమేతంగా గంటల తరబడి విహరించారు. పలువురు యువతీ, యువకులు సముద్ర కెరటాలతో పోటీపడి స్నానాలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు వన భోజనాలు చేశారు. అంతర్వేది/అల్లవరం (ఆంధ్రజ్యోతి)

అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో...



ఆటపాటలతో సందడి (పైన), ఉసిరి చెట్టుకు పూజ (కింద)

వనమంతా...

వైపీ పాలెంలో యర్రంశెట్టి వారి ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక వనసమారాధన నిర్వహించారు. లంకలగన్నవరం డొక్కావారి తోటలో పి.గన్నవరం కాపు సామాజికవర్గం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో ఉసిరిచెట్టు వద్ద అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, చిన్నారులు వివిధ రకాల ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చిన్నారులకు ఆటు కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.
పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి)



నేడు కలెక్టరేట్‌లో మీకోసం...

అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని అన్ని డివిజన్, మండల స్థాయిల్లోను, మున్సిపల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారం పొందే దిశగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యతో... ఏ విద్యార్థికీ హాల్‌టిక్కెట్ నిరాకరించరాదు

అమలాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం గానీ, తరగతులు, ప్రాక్టికల్స్‌కు హాజరు కాకుండా నిరోధించడం చేయరాదని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల్లో అయినా విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించినా, పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించినా సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫీజులు చెల్లించకపోవడం వల్ల కొన్ని కళాశాలల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, పరీక్షలు రాయనీయకుండా చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేయరాదని, దీనిపై ప్రభుత్వంగైడ్‌లైన్స్ ఇచ్చిందన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేస్తే సంబంధిత కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాల అక్కౌంట్లలోకి జమ చేస్తామని, దీనిపై త్వరలో జీవో ఇవ్వనున్నట్టు చెప్పారు.


సురేష్ స్వామి గుండెపై సీఆర్పీ చేస్తున్న స్నేహితుడు

చిన వెంకన్న దర్శనానికి వెళ్లి అనంతలోకాలకు

ద్వారకా తిరుమల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల చినవెంకన్న దర్శనార్థం వచ్చిన ఓ అయ్యప్ప మాలధారుడు స్వామిని దర్శించకుండానే గుండెపోటుకు గురై మృతి చెందాడు. అమలాపురం మండలం ఇందుపల్లికి చెందిన సురేష్ అయ్యప్పమాలను ధరించి తన మిత్రులతో కలసి పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8.50 గంటలకు ద్వారకా తిరుమలకు చేరుకున్న వారు 9 గంటలకల్లా ఆలయం మూసివేస్తారని తెలుసుకుని జంటగోపురాల వద్ద వాహనం ఉంచి అక్కడి నుంచి ఆలయానికి పరుగులు తీశారు. అయితే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలాడు. స్నేహితులు అతనికి ఫస్ట్ ఎయిడ్ చేసి త్వరగా పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్య సిబ్బంది చెప్పారు.



వారికి నష్టం... వీరికి కష్టం

గిట్టుబాటు ధర లేక రైతులు లబోదిబో...
కొనలేక వినియోగదారుల బేజారు
ఇదీ అమలాపురం రైతు బజారు దుస్థితి

అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లంక భూముల్లో రైతులు ఎంతో కష్టపడి ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. వరదల సమయంలో ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. అటువంటి వారికి కనీస గిట్టుబాటు ధర కూడా లభించక పండించిన పంటలను అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఇక బహిరంగ మార్కెట్‌లో ఆ ఆకుకూరలు, కూరగాయల ధరలు చూసి కొనుగోలుదారులు బేజారెత్తిపోతున్నారు. ఒక్కోసారి ఉదయం ఉన్న ధర సాయంత్రానికి మారిపోయే పరిస్థితి. ఇదిలా ఉంటే ఎక్కడా లేని విధంగాకూరగాయలు, ఆకుకూరల ధరలు అమలాపురం పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటాయంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగక మానదు. దాంతో అమలాపురం పరిసర ప్రాంతాలకు చెందిన వారు రావులపాలెం, మండపేట తదితర చోట్లకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు అక్కడ తక్కువ ధరలకు లభించే కూరగాయలను మూటలుగా తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రధాన పంటలు సాగుచేసేది ఈ జిల్లాలోని లంక ప్రాంతాల్లోనే మరి. కేవలం దళారుల వల్లే ధరల పెరుగుదల జరుగుతుందనేది బహిరంగ రహస్యం. ఇలా జరుగుతుందని ఇప్పుడు కాదు పాతికేళ్ల క్రితమే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించారు.

చంద్రబాబు కృషితో రైతు బజార్లు ఏర్పాటు...

పండించిన రైతులకు, కొనుగోలుదారులకు మేలు చేసేలా అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) రైతు బజార్ల ఏర్పాటుకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. 2000 నవంబరు 16న అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్ సమీపంలో సువిశాలమైన ప్రాంగణంలో నిర్మించిన రైతుబజార్‌ను నాటి సీఎం చంద్రబాబు, అప్పటి లోక్ సభాపతి జీఎంసీ బాలయోగి, కేంద్రమంత్రి మమతా బెనర్జీ అట్టహాసంగా ప్రారంభించారు. రైతు బజార్ ఏర్పాటు కోసం నాటి ఎమ్మెల్యే డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు విశేషంగా కృషి చేశారు. పంటలు పండించే రైతులకు, కొనుగోలుదారులకు ఎంతో లాభదాయకంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్ల నిర్వహణ చేపట్టారు. అమలాపురం రైతు బజార్‌లో 84 షాపులతో ప్రత్యేక సముదాయాన్ని నిర్మించారు. కొనుగోలుదారులు, రైతులతో కళకళ్లాడే ఆ ప్రాంగణంలోకి దళారులు రంగప్రవేశం చేయడంతో క్రమక్రమంగా ప్రాభవాన్ని కోల్పోయి అనంతర కాలంలోనే మూతబడిపోయింది.


తాళాలు వేసి ఉన్న రైతు బజార్

జిల్లాలో మూడుచోట్లే రైతు బజార్లు

ప్రస్తుతం జిల్లాలో మూడుచోట్ల మాత్రమే రైతు బజార్లు కొనసాగుతున్నాయి. అమలాపురంలోని రైతుబజార్ ప్రారంభించిన కొంత కాలానికే మూతబడిపోయింది. ఇక ఆలమూరులోని రైతుబజార్ వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం రావులపాలెంలో 20 దుకాణ సముదాయాలతోను, కొత్తపేటలో 10, మండపేటలో 15 దుకాణాలతో రైతు బజార్లు తూతూమంత్రంగా నడుస్తున్నాయి. రైతుబజార్‌లపై ఆది నుంచి అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు విమర్శిస్తున్నారు. పాలకులు మాత్రం ధరలు పెరిగినప్పుడల్లా ఎప్పటికప్పుడు రైతు బజార్లను వినియోగంలోకి తీసుకువస్తామని ప్రకటనలు చేస్తూ మూతబడిన రైతు బజార్లను చూస్తూ ఇప్పటివరకు గడిపేశారు.

ధరల నియంత్రణకు రైతుబజార్లే శరణ్యం...

బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయలు, ఆకుకూరల ధరలు చుక్కలనంటాయనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో అయితే ఆకుకూరలు కూడా కొనలేని పరిస్థితి. వాటి ధరలను నియంత్రించాల్సిన ఆయా శాఖల అధికారులు చోద్యంచూస్తుండడం వల్లే కూరగాయల ధరలు మండిపోతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరల నియంత్రణకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి కార్యాలయమే ధరల పర్యవేక్షణ బాధ్యతను స్వీకరించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ధరల నియంత్రణకు రైతు బజార్లే శరణ్యమని చంద్రబాబు ప్రభుత్వం గుర్తించి అందుకు తగ్గట్టుగా జిల్లా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆధ్వర్యంలో ధరల స్థిరీకరణ, నియంత్రణపై వర్తకులు, డీలర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 38 నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై నిత్యం సమీక్షిస్తుందని జేసీ ప్రకటించారు. నిత్యావసర వస్తువుల ధరలను సైతం ప్రకటించారు. గతంలో రైతు బజార్లలోనే అన్ని రకాల నిత్యావసర వస్తువులను, కూరగాయలను విక్రయించేవారు.

మరిన్ని రైతుబజార్లు ఏర్పాటు చేయాలి..

పెరిగిన ధరలతో తల్లడిల్లుతున్న వినియోగదారులు రైతు బజార్ల ప్రాధాన్యతను గుర్తించి జిల్లా వ్యాప్తంగా మరిన్ని రైతు బజార్లు ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్‌ఫ్లవర్ (ఒరిజినల్) ధర రూ.145నుంచి రూ.155 వరకు వుంది. రెండో రకం రూ.110 నుంచేమార్కెట్‌లో దొరికేస్తోంది. అయితే ఏది ఒరిజినలో ఏది డూప్లికేటో తెలియక కొనుగోలుదారులు మోసపోతున్నారు. అయితే పామాయిల్ ధర రూ.135-140 మధ్య వుంది. పామాయిల్ ప్యాకెట్ల తూకంలో భారీగా వ్యత్యాసాలు వస్తున్నాయని వ్యాపారులే చెప్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆ వైపు ఆయా శాఖల అధికారులు మాత్రం కన్నెత్తి చూడరు.




ఉప్పలగుప్తం పేరాయిచెరువులో ప్రధాన వాటర్ పైప్‌లైన్ చెంతనే విద్యుత్ స్తంభాల వల్ల దెబ్బతిన్న పైపును మార్చేందుకు ప్రయత్నాలు

వాపదర్రు ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన వాటర్ పైప్ లైన్‌ను ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల దెబ్బతిన్న పైప్ మరమ్మతు చేసేందుకు ఇబ్బంది పడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది



విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో తాగునీటికి ఇబ్బందులు

- నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- అత్యవసర వేళలో తొలగింపుపై రాద్ధాంతం
- ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖలను సంప్రదించని ట్రాన్స్‌కో

ఉప్పలగుప్తం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ రహదారిని వెడల్పు చెయ్యాలంటే అడ్డంకిగా విద్యుత్ స్తంభాలు. పంట కాల్వలను, డ్రెయిన్లను ఆధునికీకరించాలంటే అవరోధంగా విద్యుత్ స్తంభాలు. తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నప్పుడు మరమ్మతులు జరగాలంటే అడ్డుగా విద్యుత్ స్తంభాలు. వీటిని తొలగించాలంటే ట్రాన్స్‌కో రంగంలోకి దిగాలి.దీనికి బోలెడంత ఖర్చవుతుంది. ఈ ఖర్చును అవసరమైన వారు భరించాల్సిందే. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే ముందు ట్రాన్స్‌కో అధికారులు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి స్థల నిర్దేశం చేసుకోవాలి. ఆ పని ట్రాన్స్‌కో చేసినట్టు దాఖలాలు లేవు. ఆర్అండ్‌బీ రహదారుల విస్తరణ సమయంలో విద్యుత్ స్తంభాలు తొలగించేందుకు అయ్యే వ్యయాన్ని ఆర్అండ్‌బీ నిధుల్లోనే చెల్లిస్తున్నారు. సిరిపల్లి-మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ సమయంలో దీనిపై రాద్ధాంతం జరిగింది. ప్రతి స్తంభానికీ ట్రాన్స్‌కో నిర్ణయించిన సొమ్ము చెల్లించిన అనంతరమే వాటిని తొలగించారు. తాజాగా వాడపర్రు, పేరాయిచెరువుల్లో ఆర్‌డబ్ల్యుఎస్ ప్రధాన పైప్‌లైన్ నిర్వహణ పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డువచ్చాయి. ఈ కారణంగా మరమ్మతులకు రోజుల తరబడి జాప్యం జరిగి తాగునీటికి జనం ఇబ్బంది పడ్డారు. నూతనంగా విద్యుత్ లైన్ల ఏర్పాటులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు అత్యవసర సమయాల్లో నిర్వహణ పనులు సులభతరమవుతాయని సామాన్యులు సైతం గగ్గోలు పెడుతున్నారు. ఒక స్తంభం తొలగించాలంటే ముందుగా ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. వారు పరిస్థితిని గమనించాలి. అనంతరం బడ్జెట్ ఎవరి భరించాలన్న చర్చ. చివరగా కాంట్రాక్టరు సకాలంలో స్పందించి పనిచెయ్యాలి. ఇంత తతంగానికి బదులు ఆరంభంలోనే సరైన ప్రణాళికతో వ్యవహరిస్తే సరిపోతుంది గదా అని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. భవిష్యత్తులోనైనా కొత్త లైన్లు నిర్మాణంలో పక్కా ప్రణాళికతో ట్రాన్స్‌కో నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వ ధనం ఆదా అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

శెట్టిబలిజ సంఘీయుల వనసమారాధన

అమలాపురంలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహణ
తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన శెట్టిబలిజలు




అమలాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ సామాజిక వర్గీయుల్లో ఉన్న అభిప్రాయ బేధాలను పక్కనపెట్టిజాతి అంతా ఒక్కటేనని సభ్యసమాజానికి తెలియచేసే లక్ష్యంతోనే కార్తీక వనసమారాధన ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. అమలాపురంలోని ఎత్తు రోడ్డులో గల సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక వనసమారాధన ఏర్పాటుకు నాయకత్వం వహించిన సుభాష్ సామాజికవర్గీయులనుద్దేశించి ప్రసంగించారు. అమలాపురంలోకొందరు కుల పెద్దలుగా చెప్పుకునే వ్యక్తులు అమాయకులు కేసుల్లో ఇరుక్కున్నప్పుడు పట్టించుకోకుండా వదిలేశారన్నారు. అశేషంగా తరలివచ్చి వనసమారాధనను విజయవంతం చేసిన నాయకులకు సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఏనాడూ ఒక వార్డు మెంబరుగా కూడా పోటీ చేయని తాను మీ ఆశీస్సులతో రామచంద్రపురం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికై చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా కొనసాగుతున్నానన్నారు. తన మానసపుత్రిక అయిన ఎస్ఏఎఫ్‌ను స్థాపించి వచ్చే నెల జనవరి నాటికి రెండేళ్ల పూర్తవుతుందని, ఆ రోజున వార్షికోత్సవం సందర్భంగా ఎస్ఏఎఫ్‌ను మరింత విస్తరింపచేసి కులస్తుల కోసం పాటుపడతానని చెప్పారు. అంతకుముందు సుభాష్ తన స్వగృహం నుంచి భారీ ర్యాలీగా ఎత్తు రోడ్డులోని వనసమారాధన సభా స్థలికి బయల్దేరారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వివిధ పార్టీల ప్రముఖనేతలు పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, వాసంశెట్టి సత్యం, మట్టపర్తి నాగేంద్ర, గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, చొల్లంగి వెంకటరమణ, దొమ్మేటి రాము, నులుకుర్తి వెంకటేశ్వర్లు, దొంగ శ్రీను, రొంగల శ్రీధర్‌లతో పాటు ఉభయ రాష్ట్రాలకు చెందిన శెట్టిబలిజ నేతలు వేదికను అలంకరించారు. వేల సంఖ్యలో శెట్టిబలిజలు ఊరేగింపులుగా ప్రాంగణానికి చేరుకుని వనసమారాధనలో పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సత్యదేవుడి సన్నిధి.. భక్తజనసంద్రం



అన్నవరంలో స్వామివారి దర్శనంకోసం క్యూలైన్‌లో వేచియున్న భక్తులు


అన్నవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పర్వదినాలు ముగింపు దశకు చేరనుండడంతో సత్యదేవుడి సన్నిధిలో రద్దీ క్రమేపీ పెరుగుతుంది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వామివారి సన్నిధి భక్తజన సంద్రమైంది. ఆదివారం ఒక్కరోజు 8893 వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా రూ.90లక్షల ఆదాయం సమకూరింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు గంటలనుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించినా ఉదయం 9గంటల నుంచి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఈవో రామచంద్రమోహన్ క్యూలైన్‌ల వద్ద నుంచి త్వరితగతిన భక్తులు దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. సత్యదేవా నిత్యాన్నదాన పథకం ద్వారా 30వేలమందికి ఉచిత పులిహోర దద్దోజన ప్రసాదం వితరణ చేశారు. 80వేలమంది స్వామిని దర్శించుకున్నారు.

- ఒక్కరోజే 8893 వ్రతాలు
- రూ.90 లక్షల ఆదాయం

నేడు, రేపు రద్దీ

కార్తీక చివరి సోమవారం, మంగళవారం బహుళ ఏకాదశి పర్వదినం కావడంతో ఈ రెండు రోజులు స్వామివారి ఆలయంలో రద్దీకొనసాగనుంది. దీనికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై దృష్టిసారించారు.

తెరచాటు సూరీడు..



ఎత్తైన కొండల నడుమ నల్లటి మబ్బుల మధ్యలో ఎర్రటి సూరీడు అస్తమించే ఈ సుందర దృశ్యం కట్టిపడేస్తోంది కదూ.. సత్యదేవుడి గిరిప్రదక్షిణ మార్గంలో ఆవిష్కృతమైన ఈ చిత్రం ప్రకృతి ప్రేమికులను రంజింపచేస్తోంది. దీన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది. అన్నవరం/(ఆంధ్రజ్యోతి)

పలు రైళ్ల రద్దు

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో తాడి-దువ్వాడ రైల్వే సెక్షన్‌లో చేపడుతున్న నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా విజయవాడ నుంచి సామర్లకోట జంక్షన్ మీదుగా విశాఖకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వేఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

- 12717 నెంబరుగల విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రైలును ఈనెల 25న రద్దు చేశారు.
- 12718 నెంబరు గల విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే రైలును ఈనెల 25న రద్దు చేశారు.
- 17267 నెంబరు గల కాకినాడ-విశాఖపట్నం, 17268 నెంబరుగల విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రైళ్లను ఈనెల 25న రద్దు చేశారు.
- 17239, 17240 నెంబర్లుగల గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు 25న రద్దు చేశారు.
- 17267, 17268 నెంబర్లు గల కాకినాడ పోర్టు-విశాఖ-కాకినాడ పోర్టు మధ్య రాకపోకలు సాగించే పాస్ట్ పాసింజర్లు 25న రద్దు చేశారు.
- 07466, 07467 నెంబర్లు గల రాజమహేంద్రవరం-విశాఖ-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే పాసింజర్ రైళ్లు 25న రద్దు చేశారు.

ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా తమ ప్రయాణాలను కొనసాగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

గండి పోశమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

దేవీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి దర్శనాలు ఇటీవల అధికారులు పునః ప్రారంభించడంతో ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం కావడంతో అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది.



భక్తులకు దర్శనమిస్తున్న గండిపోశమ్మ తల్లి

ఉత్కంఠభరితంగా ఉమ్మడి జిల్లా బాస్కెట్ పోటీలు

పిఠాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ పోటీలు రెండు రోజులుగా ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం, రాత్రి కూడా ఈ పోటీలు జరిగాయి. మహిళలు, పురుషుల జట్లు సెమీఫైనల్‌కి చేరాయి. అర్ధరాత్రి వరకూ ఈ పోటీలు జరిగ్గా ఈ పోటీలను క్రీడాకారులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల విజేత ‘తూర్పు’

కాకినాడ అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి); రెండురోజులుగా కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి రగ్బీపోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో విజేతగా ఉమ్మడి జిల్లా బాలికల జట్టు నిలిచింది. గుంటూరు రెండోస్థానం దక్కించుకోగా ప్రకాశం మూడోస్థానం నిలిచింది. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షతన జరిగిన సభలో విజేతలకు మెమెంలోలు అందజేశారు. వివిధ జిల్లాలనుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబరులో రాంచిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జార్జి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, పరిశీలకుడు గణేష్, నాగేంద్రకుమార్, రమణరాజు, వి.రవిరాజు, కె.నూకరాజు, సునీల్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బాలికల రగ్బీ పోటీల్లో విజేతగా నిలిచిన తూర్పు జట్టు

కోటసత్తెమ్మకు పూజలు



నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి విశేష దర్శనం, నిత్యదర్శనం చేపట్టారు. అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.









రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బీవీఆర్ చౌదరితో కుటుంభీకులు, వెంకటరమణచౌదరిని అభినందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దాట్ల సుబ్బరాజు

రుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- రానున్న 40 ఏళ్లు దృష్టిలో పెట్టుకుని చేస్తా
- గత అక్రమాలపై దృష్టిపెడతా
- రుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారంలో బొడ్డు వెంకట రమణ చౌదరి



బీవీఆర్ చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న 40ఏళ్లలో రాజమహేంద్రవరం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించడమే నా ప్రధాన లక్ష్యమని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో ఆది వారం రుడా చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత బొడ్డు వెంకట రమణ చౌదరి తండ్రి బొడ్డు భాస్కరరామారావు చిత్రపటానికి పూలమాల వేసి బొడ్డు కుటుంబీకులు తల్లి జగన్నేహిని, సతీమణి సురేఖ, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అనంతరం వెంకటరమణచౌదరి మా ట్లాడుతూ నాకు రుడా చైర్మన్ పదవి ఇచ్చిన సీ ఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజానగరం టీడీపీ శ్రేణులవల్లనే తనకు ఈ పదవి వచ్చిందన్నారు. అభివృద్ధిలో సమప్రాధాన్యం ఇస్తామన్నారు. రాజమహేంద్రవరం నగరం వేగంగా అభివృద్ధి చెందు తూ ఉన్నతంగా ఉండాలన్నారు. ఇందులో తమవంతు పాత్ర పోషిస్తామన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటికే అధికారులతో సమాలోచన చేస్తున్నామన్నారు. రుడా పరంగా కొత్త ప్రాజెక్టులు వస్తాయన్నారు. రుడా నుంచి అభివృద్ధి వైపు కార్యకలాపాలు నిర్వహిస్తూనే మరోవైపు గత పాలకుల అవినీతి అక్రమాలపై దృష్టిపెడతామన్నారు. అందరి సహకారం సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి సౌమ్యులని కానీ గత పాలకుల లెక్కలు తేలుస్తారని చెప్పారు. కూటమిలో చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ తామంతా చంద్రబాబుకోసం రాష్ట్ర శ్రేయస్సు కోసం తగ్గి కలిసికట్టుగా వెళతామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ హాజరై అభినందనలు తెలిపారు. తొలుత బొడ్డుకు ఆదిరెడ్డి వాసు పెయింటింగ్ బహూకరించారు. తొలుత బొడ్డు వెంకటరమణచౌదరి రాజానగరం నియోజకవర్గం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. రూరల్ గ్రామాల గుండా రాజమహేంద్రవరం చేరుకున్నారు. బొడ్డుకు ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. అనంతరం భారీ స్థాయిలో చెరుకూరి కళ్యాణ మండపానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ సీనియర్ నేత గన్నికృష్ణ, నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన రాజమహేంద్రవరం ఇన్ చార్జి అనుశ్రీ సత్యనారాయణ, పరిమి వాసు, ఇతర ముఖ్యనాయకులు బొడ్డుకు అభినందనలు తెలిపారు.

కార్మిక నాయకుడు గల్లా రాము మృతి



అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కార్మిక నాయకుడు గల్లా రాము(83) ఆదివారం మృతి చెందారు. ఆది నుంచి కార్మిక ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అభిమానిగా ముద్ర వేసుకున్న రాము పార్టీ ఆవిర్భావం సమయంలో అమలాపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎన్టీఆర్ కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. అప్పటికే పేరొందిన దూలం నాగేశ్వరరావు పేరును రాము సూచించారు. నాగేశ్వరరావు కూడా తిరస్కరించడంతో 1983లో మెట్ల సత్యనారాయణ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. టీడీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా ఆయన రెండు దశాబ్దాలు పనిచేశారు. అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి సిఫార్సుతో రైల్వే యూజర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. రాముకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


విచారణ అధికారిని నియమించాం : డీఈవో

కాకినాడరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురం అన్నమ్మ ఘాటీ జీఎంసీ బాలయోగి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై విచారణ అధికారిని నియమించినట్లు డీఈవో రమేష్ తెలిపారు. విచారణ అనంతరం నివేదిక అందిన వెంటనే ఆ ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

శోభాయమానంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయం

- రేపు 61వ కార్తీకదీపారాధన మహోత్సవం

ద్రాక్షారామ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకదీపారాధన మహోత్సవానికి ద్రాక్షారామ శోభాయమానంగా ముస్తాబు అయింది. ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయ బాలభక్తసమాజం ఆధ్వర్యంలో రేపు 61వ కార్తీక దీపారాధన మహోత్సవం జరుగనుంది. కార్తీక మాసం ఆఖరు మంగళవారం భీమేశ్వరస్వామివారి ఆలయబాహ్య ప్రాంగణంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంవద్ద కార్తీకదీపారాధన వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. 61వ కార్తీకదీపారాధనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్య ప్రాంగణం, సప్తగోదావరి నదిఒడ్డున, బోసు బొమ్మసెంటర్‌లో మిరుమిట్లు గొలిపే విద్యుత్, ఎల్ఈడీ దీపాల సెట్టింగ్‌లతో అలంకరించారు. సప్తగోదావరినది మధ్యలో ఆంజనేయస్వామిభారీ కటౌట్ ఏర్పాటుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.





సప్తగోదావరినది మధ్యలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి భారీ కటౌట్, సెట్టింగ్

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రసన్నాంజనేయస్వామికి విశేష లక్షతులసి పూజ, పంచామృత అభిషేకం నిర్వహిస్తారు. రాష్ట్ర కార్మికశాఖ, పరిశ్రమలుశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజాధికాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఉష్ణవాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. రాజ్యసభసభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నగరోత్సవం ప్రారంభిస్తారు. 4నుంచి 5 గంటల వరకు అక్కిరెడ్డి అబ్బు బృందంచే భజన కాలక్షేపం జరుగుతుంది. సాయంత్రం 5.24 గంటలకు అఖండ దీపారాధనను ప్రసన్నాంజేయస్వామి బాలభక్త సమాజం గౌరశాధ్యక్షుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు ప్రారంభిస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

తదుపరి శుభమ్ ఈవెంట్స్‌చే సినీ గాయకులు శ్రీలలిత, సత్య, సిద్ధూరాక్‌స్టార్‌లచే సినీ సంగీత విభావరి జరుగుతుంది. జబర్దస్త్ బృందం రైజింగ్‌రాజు, దొరబాబు, హరిత, రాజమౌళిచే హాస్య సన్నివేశాలు ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం దవులూరి శ్రీనివాస్‌చే బాణాసంచా కాల్పులు ఉంటాయి. తదుపరి ఉమాశ్రీవాణి కళానికేతన్ వారిచే రామాంజనేయ యుద్ధం వారిసీను, రాజనర్తకి నాటకం జరుగుతాయి. రామచంద్రపురం డీఎస్పీ పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక దర్శనం క్యూలైనులో భక్తులు

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆఖరు కార్తీక ఆదివారం భక్తులరద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉసిరిక వృక్షంవద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అన్నదాన భవనంలో అన్నదానం నిర్వహించారు. పైండావారి సత్రంలో యథావిధిగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ పర్యవేక్షణలో భక్తులకు సేవలు అందించారు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాపికొండలకు 12 బోట్లు

దేవీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది పాపికొండలు అందాలు తిలకించేందుకు తరలివచ్చారు. మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరివాహక ప్రాంతాలమీదుగా ప్రకృతి ప్రేమికులు 12బోట్లలో 850మంది పర్యాటకులు పాపికొండలు మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. రెండు గంటలపాటు పాపికొండల్లో సందడి చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పోశమ్మగండి చేరుకున్నారు. భారీగా పర్యాటకులు హాజరుకావడంతో సందడి నెలకొంది. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని పాపికొండలు వెళ్లారు.



పాపికొండలకు వెళుతున్న బోటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

సాహిత్యానికి అనుబంధం కథ

- డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

కాకినాడరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కథ అనేది చరిత్రకు, జీవితానికి, సాహిత్యానికి అనుబంధం వంటిదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి అన్నారు. ఐడీయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కథ ఏమిటి ఎందుకు ఎలా అనే అంశంపై ఒక సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభాధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ మనిషి పుట్టగానే కథ వచ్చింది, బాలసాహిత్యం నుంచి అద్భుత కథలు వచ్చాయన్నారు. అనంతరం నండూరి రాజగోపాల్ మాట్లాడుతూ పెద్దల నుంచి విన్నదే కథ అని, అది జీవితంలో ఒక భాగం అయిందని పేర్కొన్నారు. అనంతరం వాడ్రేవు వీరలక్ష్మి, మహమ్మద్ ఖదీర్‌బాబు ప్రసంగించారు. మణిబాబు, వీరబాబు, సత్యనారాయణ, వెంకటనరసింహ శాస్త్రి, శైలజ, చింతపల్లి సుబ్బారావు, స్టీవెన్‌రాజు పాల్గొన్నారు.

చంటిబిడ్డ మృతిపై బంధువుల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చంటిబిడ్డ మృతి చెందిన సంఘటనపై బాధిత బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఏలేశ్వరం పెద్దవీధికి చెందిన బండి లక్ష్మణ్ భార్య డెలివరీ నిమిత్తం అక్టోబరు 30న ఆసుపత్రిలో చేరింది. ఆమెకు కవల పిల్లలు పుట్టారు. ఇద్దరిలో ఒక పాపకు ఆరోగ్యం బాగోలేదని.. అప్పట్నుంచి ఎన్ఐసీయూలో పెట్టి చికిత్స అందిస్తున్నారు. అయితే శనివారం రాత్రి బేబి మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో లక్ష్మణ్ ఆవేదనతో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగాడు. తమవల్ల కాదు అంటే వేరొక హాస్పటల్‌కు పాపను తీసుకువెళ్లి చికిత్స చేయించుకునేవారమని.. చెప్పకుండా చంపేశారని ఆసుపత్రి వర్గాల తీరుపై మండిపడ్డారు. అటుపై బేబి మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న చంటిబిడ్డ బంధువులు

అమలాపురం

నిత్యావసరాల పంపిణీ

రాజోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం దిగమర్రు శశి కళాశాల, మనం ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజోలు వివేకానంద మనోవికాస్ కేంద్రంలోని దివ్యాంగులకు నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్ అందజేశారు.

లక్ష బిల్వార్చన

అంబాజీపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీవ్యాఘ్రేశ్వరస్వామి ఆలయం, గంగలకుర్రు ఆనందరామేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన పూజలు ఆదివారం నిర్వహించారు. ఆర్టీసీబస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఏకాదశరుద్రులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పరాకాష్టకు చేరిన మత రాజకీయాలు

హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న



డాక్టర్ గుమ్మా వీరన్న రచించిన అభ్యుదయ ధోరణులు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

అమలాపురంటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశంలో మత రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న పేర్కొన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చేసి హిందూ రాష్ట్రంగా మార్చాలని కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈప్రమాదం నుంచి ప్రజలను కాపాడుకోవాలంటే హేతువాద మానవవాదమే శరణ్యమని పేర్కొన్నారు. ఆదివారం అమలాపురంలోని ఎస్టీయూ జిల్లా శాఖ కార్యాలయంలో హేతువాద సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాజశేఖర్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా సభ నిర్వహించారు. 'మత విశ్వాసాలు-సైన్స్' అంశంపై జాతీయ అధ్యక్షుడు వీరన్న మాట్లాడారు. మనుషుల్లో వైజ్ఞానిక వికాసం వస్తేనే హేతుబద్ధంగా ఆలోచించి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలుగుతారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవ సమాజానికి స్వేచ్ఛ, నైతిక ప్రవర్తన అత్యవసరాలని న్యాయవాది టి.వసంతరావు పేర్కొన్నారు. 'సనాతన ధర్మం-మానవ ధర్మం' అంశంపై ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎందుకు, ఏమిటి, ఎలా అని ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. 'భౌతిక వాస్తవికవాదం-మానవవాదం' అంశంపై డాక్టర్ వీరన్నతో పాటు జనిపల్లి భీమారావు మాట్లాడారు. 'విశ్వపరిణామం-జీవపరిణామం' అంశంపై జాతీయ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ, తోట బాలకృష్ణ మాట్లాడుతూ విశ్వాన్ని అవగాహన చేసుకుంటే అది మనుషుల మధ్య స్వేచ్ఛకు దారితీస్తుందన్నారు. హేతుబద్ధ ఆలోచనలపై డి.రాజశేఖర్, డి.ప్రకాష్ మాట్లాడారు. డాక్టర్ గుమ్మా వీరన్న రచించిన 'ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ ధోరణులు' గ్రంథాన్ని డాక్టర్ పులైపు వెంకటేశ్వరరావు, మేడూరి సత్యనారాయణ రచించిన పిల్లల పెంపకం పుస్తకాన్ని డాక్టర్ చైతన్యశేఖర్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా మహాసభలో ఎలిజిబెత్‌రాణి, అమలదాసు బాబూరావు, టి.కేశవరావు, కేవీ రమణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు డీబీ లోక్



ఈదరపల్లిలో ఎస్సీవర్గీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తున్న డీబీ లోక్

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధమని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు డీబీ లోక్ ధ్వజమెత్తారు. 2004లో వర్గీకరణ చెల్లదని తీర్పునిచ్చిన సర్వోన్నత న్యాయస్థానమే 2024లో వర్గీకరణ చెల్లుతుందని తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధంగా భావిస్తున్నామన్నారు. మాలలకు న్యాయం జరిగేలా ప్రజా ఉద్యమాన్ని చేపట్టేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జిల్లా మాల సామాజికవర్గ నాయకుల ఉద్యమ కార్యాచరణ సన్నాహక సమావేశాన్ని ఈదరపల్లిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో లోక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని మార్చాలంటే పార్లమెంటులో చర్చ జరిగి మెజార్టీ సభ్యుల ఆమోదం పొందాలన్నారు. ఎస్సీ కులగణన జరిగిన తర్వాత మాత్రమే వర్గీకరణ అంశంపై మాట్లాడాలని తీర్మానించారు. ఎస్సీ వర్గీకరణ తీరుపై దళిత నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబూరావు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, కోట రామ్మోహనరావు, పొలమూరి మోహన్‌బాబు, పుణ్యమంతుల రజనీ, గొల్లపల్లి డేవిడ్, చింతా రాజబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలు కోల్పోయిన 22 పథకాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలని తీర్మానించారు. కాగ్ అధిపతిగా కె.సంజయ్‌మూర్తి బాధ్యతలు స్వీకరించడం పట్ల జిల్లాలోని 22మండలాల మాల ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపి హర్షం ప్రకటించారు. త్వరలోనే మాలల సమారాధన నిర్వహించేందుకు నిర్ణయించారు. సమావేశంలో గూటంసాయి, సాధనాల వెంకట్రావు, నెల్లి లక్ష్మీపతి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, జిత్తుక సత్యనారాయణ, తోటే ప్రతాప్, మట్టా సురేష్, చిలకపాటి శ్రీధర్, గెద్దాడ బుద్ధరాజ్, కొంకి రాజామణి పాల్గొన్నారు.

జగద్గురువుల విజయయాత్ర ఏర్పాట్ల పరిశీలన



మలికిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమెళ్లంక గ్రామానికి విచ్చేసిన శృంగేరీ పీఠ జగద్గురువులు విధుశేఖర భారతీ మహాస్వామి విజయ యాత్ర ఏర్పాట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. జగద్గురువుల విజయ యాత్రకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యాత్ర లోటుపాట్లు లేకుండా సాగాలని ఆదేశించారు. ఆదివారం రాత్రి గుడిమెళ్లంక చేరుకున్న భారతీమహాస్వామిని చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. స్థానికంగా ఘన స్వాగతం పలికారు. శ్రీఉమాలక్ష్మణేశ్వరస్వామి ఆలయ ప్రవేశం, పూజా అభిషేకాలకు సోమవారం ఏర్పాట్లు జరిగాయని కమిటీ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సీఐ నరేష్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ



అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడు, అప్పనపల్లి బాలబాలాజీస్వామి, కుండలేశ్వరస్వామి, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేపచెట్టు వద్ద కార్తీక దీపారాధనలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం ఆదివారం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించారు. సిద్ధివినాయకుని దర్శనానికి గంటల కొలదీ భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయంలో మండపాలు, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సేవలందించారు. ఆదివారం సిద్ధివినాయకుని ఆదాయం రూ.4లక్షలు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. 5420మంది అన్నప్రసాదం స్వీకరించారు.

బాలబాలాజీ ఆదాయం రూ.4.14లక్షలు

మామిడికుదురు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఆదివారం భక్తులతో పోటెత్తింది. కార్తీకమాసం ఆదివారం కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామివారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానంలో నిర్వహించిన నిత్య కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం స్వామివారికి రికార్డు స్థాయిలో రూ.4,14,623 ఆదాయం వచ్చిందని, 6578మంది దర్శించుకుని, 4259మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం సిబ్బంది, అధికారులు ఏర్పాట్లు చేశారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రానికి ఉభయ రాష్ట్రాలు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయపురవీధులు భక్తులు, వాహనాలతో కిక్కిరిశాయి. ఆలయ మండపాలు, గోపురాలు, క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఆలయ సిబ్బందితో పాటు సేవకులు కూడా భక్తులకు సేవలందించి స్వామి-అమ్మవార్ల దర్శనం చేయించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రద్దీ కారణంగా భక్తులకు నిత్యాన్నదానంలో బఫే పద్ధతిలో ప్రసాదాన్ని అందించారు. స్థానిక సేవా బృందం నిత్యాన్నదానం, క్యూలైన్లలో ఉన్న భక్తులకు ప్రసాదం అందించింది. క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయం, అశ్వరూఢాంబిక ఆలయాలతో పాటు వశిష్ఠాశ్రమాన్ని భక్తులు సందర్శించారు.

కుండలేశ్వరంలో పూజలు

కాట్రేనికోన, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మురమళ్ళకు చెందిన సరిపల్లి వీరవెంకటసూర్యవర్మ, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 5000మంది భోజనాలుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. సీనియర్ టీడీపీ నాయకుడు పీఎస్ఎన్ రాజు ఆర్థిక సహాయంతో కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం వరకు 10ఆటోల ద్వారా భక్తులను తరలించే ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ పెరగడంతో పలుమార్లు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ముందు జాగ్రత్త చర్యగా కిలోమీటరు దూరంలోనే వాహనాలను నిలిపివేయించారు. ఈవో కె.గంగాధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, పీఎస్ఎన్ రాజు, మీసాల నాగబాబు, మోటిపల్లి చిన్న, అక్కల నాగమందేశ్వరరావు, గంగుమళ్ళ కిరణ్, మోటిపల్లి శ్రీను, మీసాల నాగబుల్లియ్య, మీసాల పూర్ణ, మీసాల బాల, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్ పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగులకు వేతన సవరణచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకట్రామయ్య డిమాండు చేశారు. ముమ్మిడివరంలోని సీహెచ్ గున్నేపల్లిలో జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు అధ్యక్షతన సహకార ఉద్యోగుల జిల్లా యూనియన్ సంఘ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు తోట మాట్లాడుతూ సహకార ఉద్యోగులకు జీవో నంబరు 36 ప్రకారం వేతన సవరణచేసి సవరించిన వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ జీవో 36 ప్రకారం ప్రభుత్వాలు మారుతున్న సహకార ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదన్నారు. మావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు నూకల బలరామ్, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శులు కుంపట్ల అయ్యప్పనాయుడు, మట్టపర్తి జయరామ్, జిల్లాలోని సహకార సంఘ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సంఘంలో ఒక సభ్యుడిగానే భావిస్తా: మల్లాడి



వనసమారాధనలో పాల్గొన్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): యానాం శెట్టిబలిజ సంఘంలో ఒక సభ్యుడిగానే తాను భావిస్తున్నానని బీసీ సంఘాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఫెర్రీ రోడ్డులో వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శెట్టిబలిజ కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముందుగా యానాం సంఘ అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం దంపతులు, పలువురు సభ్యులు, ప్రముఖులు ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా మల్లాడి మాట్లాడారు. సంఘం స్థలానికి సంబంధించి సంఘం అంతా కలిపి సగ భాగం, మిగిలిన సగ భాగం తాను భరిస్తానని ఇప్పటికే చెప్పినట్టు గుర్తుచేశారు. అనంతరం సంఘ సభ్యులు మల్లాడిని ఘనంగా సత్కరించారు. విశిష్ట అతిథి కుడిపూడి శివన్నారాయణ, యానాం సంఘం గౌరవ అధ్యక్షుడు చీకట్ల సత్యనారాయణ, సంఘ సభ్యులు మాట్లాడారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమెన్ స్పూన్, చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. సంఘీయులందరూ సహపంక్తి భోజనాలు చేశారు. యానాం శెట్టిబలిజ కార్యవర్గ సభ్యులు, సంఘ ప్రముఖులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాపు కార్తీక వనసమారాధన

యానాం తెలగా (కాపు) అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ మాట్లాడారు. కాపు కులస్థులు ఒకే తాటిపై ఉంటూ కులాన్ని అన్ని విధాల సహాయ కార్యక్రమాలు చేయాలన్నారు. సంఘ సభ్యులకు ఆటల పోటీలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు నల్లా వెంకన్న, రాంమూర్తి, చిక్కాల నరసింహమూర్తి, కొన సుబ్బారావు, చెక్కల అరుణ్‌కుమార్, గుండాబత్తుల ప్రసాద్ నాయుడు, రత్న, బికేదార్నాథ్ పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి



అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మినీమం టైమ్‌స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని కోరుతూ ఎంటీఎస్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. కనీస పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను విద్యా శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని సుభాష్ హామీ ఇచ్చారు. కడలినాగరాజు, బొంతు శ్రీనివాస్, బండి రమణకుమార్, గుత్తుల వెంకటేశ్వరరావు, దొమ్మేటి నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల రక్షణకే రైతుల సమావేశం

అంతర్వేది, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామాల రక్షణే లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్) అన్నారు. అంతర్వేది దేవస్థానం సముద్ర తీరం ప్రాంతంలో వత్తి సత్యనారాయణ స్థలంలో దేవస్థానం సర్పంచ్ కొండా సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సముద్రపు నీరు, గోదావరి పోటు నీరు, వర్షంనీటితో తీర గ్రామాలు తరచూ ముంపునకు గురవ్వడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. వేసవిలో కాల్వలు, పంటచేలు ఇంకిపోకుండా సరైన డ్రైనేజీ సదుపాయం లేక నీరు నిలిచిపోతోంది. ఈసమస్యలను పరిష్కరించడానికి రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు ఆర్థిక సహకారం అందించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, జంపన ప్రసాదరావు, చొప్పల నరసింహస్వామి, అడపా రాంబాబు, మూడు గ్రామాల తీర ప్రాంత నాయకులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన సుభాషిణి



అమలాపురం టౌన్, నవంబరు 24(ఆంధ్ర జ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని కాంగ్రెస్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి-కుమార్‌సింగ్ దంపతులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీని బలోపేతంపై చర్చించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు



కాపు ఉద్యోగ సేవాసమితి నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళల ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆదివారం వివిధ సామాజికవర్గీయుల కార్తీక వనసమారాధనలు జరిగాయి. అమలాపురం పట్టణ అగ్నికుల క్షత్రియ సేవామిత్ర సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం వద్ద వనసమారాధనలు నిర్వహించారు. తొలుత అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన లంకే భీమరాజును సత్కరించారు. చిన్నారులు, మహిళలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘీయులంతా సమష్టిగా అభివృద్ధి చెందాలని చిప్పల సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. కొల్లు సత్యనారాయణమూర్తి, ఎస్.ఆదినారాయణ, నాత్రి వీర్రాజు, వైదాడి సత్యనారాయణ, కొప్పాడి నాగవర్మ పాల్గొన్నారు.

కాపు ఉద్యోగ సేవా సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం కర్రి సత్యనారాయణ రైస్‌మిల్లు ఆవరణలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కాపు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పేద కాపు విద్యార్థులకు ఆర్థిక సాయం గతంలో మాదిరిగానే అందించి వారిని ప్రోత్సహించేందుకు నిర్ణయించారు. కార్తీక వనసమారాధన అనంతరం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అన్యం రాంబాబు, అధ్యక్షుడిగా నల్లా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సాధనాల యెల్లేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా వలవల రాజా, గౌరవ సలహాదారుడిగా పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పోతంశెట్టి దొరబాబులను ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఎస్వీ నాయుడు, కుంపట్ల సుబ్బారావు, కురచ రామకృష్ణ మాట్లాడుతూ సంఘీయులంతా ఐకమత్యంతో మెలగాలని సూచించారు.

చెల్లి అశోక్‌కు సత్కారం

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన చెల్లి అశోక్‌ను ఆదివారం ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలోని ఆయన గృహానికి పలువురు వెళ్లి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపి సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్త, తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపక సంఘ గౌరవ ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లా నరసింహమూర్తి, రాష్ట్ర అంగన్‌వాడీ డ్వాక్రా సాధికార ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమల, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి గోపి తదితరులు అశోక్‌ను సత్కరించారు. వారి వెంట చెల్లి ప్రసాద్, బళ్ల నరహరి, బాలరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

7న మాలల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాలల ఐక్యతను చాటుతూ డిసెంబరు 7న జిల్లా స్థాయిలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు దళిత సంఘ నాయకులు డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబూరావు, ఎంపకే భీమారావు పేర్కొన్నారు. మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కౌశిక జలధార ఏర్పాటు

అంబాజీపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రులో అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాఘ్రేశ్వరం ఆలయం వద్ద కౌశిక జలధార కార్యక్రమం ద్వారా జల్లు స్నానాన్ని భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. దీనిని 316జిల్లా గవర్నర్ లయన్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, సర్పంచ్ జల్లి బాలరాజు ప్రారంభించారు. అలాగే ఇంటర్ చదువుతున్న నిరుపేద విద్యార్థికి రూ.15వేలు స్కాలర్‌షిప్‌ను అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీరా రవి, ఉషాబాల, చిక్కాల అరుణ, కామేశ్వరి, జెహరా హనుమంతరావు, లక్కింశెట్టి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉసిరి చెట్టుకు పూజలు

అంబాజీపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆదివారం సందర్భంగా పలు గ్రామాల్లో వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు గేమ్స్, డ్యాన్సులతో ఉత్సాహంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో గడిపారు.

ఎస్టీయూ కార్తీక వనసమారాధన

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గేదెల్లంక గ్రామంలోని ఉత్తర వాహిని పుష్కరాల రేవు వద్ద ముమ్మిడివరం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. మండలంలోని ఉపాధ్యాయులంతా కుటుంబ సభ్యులతో వనసమారాధనలో పాల్గొన్నారు. ఉత్తరవాహిని పుష్కరరేవు ప్రత్యేక విశిష్టతను సంతరించుకున్న దృష్ట్యా వారంతా వనసమారాధన కార్యక్రమాన్ని అక్కడ ఏర్పాటు చేసుకున్నారు.

కాశీవిశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన

అల్లవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నంలోని బాలాత్రిపురసుందరీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. మంగళంపల్లి నరసింహమూర్తి బ్రహ్మత్వంలో వేదపండితులు పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన జరిపారు. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు ఉద్దగిరి బాబి, మోటమర్రి సుబ్రహ్మణ్యం, మోటమర్రి ప్రకాశరావు, మన్యం సుబ్బారావు, ఉద్దగిరి వీర్రాజు, మన్యం సూరిబాబు, మోటమర్రి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో అల్లూరి సత్యనారాయణరాజు ఇంటి వద్ద బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వచ్చిందన్నారు. మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు, కొణతం శ్రీనివాసరావు, అల్లూరి సత్యనారాయణరాజు, ఇందుకూరి సుబ్బరాజు, నంబూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీస్తురాజు పుణ్యక్షేత్ర మహోత్సవం

అంబాజీపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కముజువారిపేటలో ఉన్న ప్రార్థనా మందిరంలో క్రీస్తురాజు పుణ్యక్షేత్ర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రెవ.ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలు ఆచరించినప్పుడే ప్రపంచ శాంతి చేకూరుతుందన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



బండారులంకలో శ్రీవేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం

అమలాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బండారులంకలో శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీశ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో సుగంధ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. అర్చకులు స్వామివారి తరపున, భక్తులు దేవేరుల తరపున కల్యాణకర్తలుగా వ్యవహరించారు. డాక్టర్ దైవపు సునీల్‌కుమార్-సత్యప్రియాంక దంపతులు కల్యాణ క్రతువు జరిపించారు. యజ్ఞోపవీతధారణ, మంగళసూత్రధారణ, వేద మంత్రోచ్చారణల నడుమ జరిగింది. కారుపర్తి మల్లేశ్వరరావు శిష్యబృందం అర్చకత్వంలో నిర్వహించిన కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. అనంతరం శివ, గోవిందనామస్మరణల నడుమ లక్ష దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి-బాబు దంపతులు, ఎంపీటీసీ అంకం హిమభారతి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు, ఉప్పుగంటి భాస్కరరావు, బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం నాగసత్యనారాయణ, బిళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం సాగించాలి

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించుకునేందుకు అవసరమైతే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పోరాటం సాగించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం కోనసీమ జిల్లా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడుగా కాళే సురేష్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా మేడిశెట్టి మణికంఠ స్వామి, ప్రధాన కార్యదర్శిగా షాలెంరాజు, కోశాధికారిగా శివరామ్, మహిళా కార్యదర్శిగా సింధుశ్రీ, ఉపాధ్యక్షుడులుగా ఏసు, రాజు, సంయుక్త కార్యదర్శులు వివేక్, వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సంతోష్, సత్తిబాబు, టెక్నికల్ కార్యదర్శులుగా సురేంద్ర, జయకృష్ణ, మీడియా కార్యదర్శులుగా సాయికృష్ణ, సంతోష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నుంచి రాష్ట్ర ప్రతినిధిగా వై.గోవిందబాబును ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు కాళే సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇంజనీరింగ్ అసిసెంట్లు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లంతా పాల్గొన్నారు.

మల్లాడి స్వగృహంలో 18వ అయ్యప్ప పూజ

యానాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వగృహంలో వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా 18వ అయ్యప్ప పూజ ఘనంగా నిర్వహించారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వెయ్యి మంది అయ్యప్పస్వాములకు, భవానీ, శివ భక్తులను అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం మల్లాడి దంపతులు పండ్లు పంపిణీ చేశారు.

దుబాయ్‌లో సఖినేటిపల్లివాసి మృతి



అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలానికి చెందిన నేతల విద్యాసాగర్ (41) దుబాయ్‌లో రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుండెపోటుతో అతడు మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. విద్యాసాగర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు చిన్న వయసులోనే ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడని తండ్రి వసంతరెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సాగర్ మృతితో సఖినేటిపల్లి మండలంలో విషాదఛాయలు అలముకున్నాయి. విద్యాసాగర్ మృతదేహం మంగళవారం స్వస్థలానికి చేరుతుందనితండ్రి చెప్పారు.

అధికార లాంఛనాలతో లోవరాజుకు అంత్యక్రియలు

అమలాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐటీబీపీ కానిస్టేబుల్ చింతపల్లి లోవరాజు (32)కు ఆయన స్వగ్రామం పేరూరులో ఆదివారం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. లోవరాజు మృతదేహాన్ని ఉదయం స్వగ్రామం తీసుకువచ్చారు. ఐటీబీపీ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.బాలనాయక్, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 56వ బెటాలియన్ సిబ్బందితో కలిసి మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించారు. గాలిలోకి కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా గ్రామపెద్దలు పాల్గొన్నారు.

డీజిల్ తరలిస్తున్న ఆటో సీజ్

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కుడుపూడి నరేష్, కేతా శ్రీనివాస్‌లు ఆటోలో యానాం నుంచి రూ.80వేలు విలువైన వెయ్యి లీటర్ల డీజిల్‌ను టిన్నుల్లో తరలిస్తుండగా కొండాలమ్మచింత సమీపంలో ఆటోను సీజ్‌చేసి, డీజిల్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

ఆలయ కమిటీల్లో ఆర్యవైశ్యులకు స్థానం కల్పించండి



ఎమ్మెల్యే ఆనందరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఉప్పలగుప్తం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని దేవాలయాలు, మార్కెట్ కమిటీల పాలకవర్గాల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కోరారు. అమలాపురంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సమావేశమైన ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు భీమనపల్లికి చెందిన కంకటాల రామానికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు వరదా సూరిబాబు, అప్పన వీరన్న, కూరపాటి మావుళ్ళయ్య, సుగ్గు గోపి, నూలు కృష్ణ, యర్రమిల్లి సత్తిబాబు, శ్రీకాకోళపు రాంపండు, పచ్చిగోళ్ళ రాజు, గమిడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఒకరోజు ఆదాయం రూ.7.20 లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసంతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నోము ఆచరిస్తున్న భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.7,20,126 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



సీనియర్ నటుడు జిత్‌మోహన్‌మిత్రాను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

బ్రాహ్మణ సంఘ కార్తీక వనసమారాధనలో వక్తలు

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశహితం, ప్రజాహితం కోరుకునే బ్రాహ్మణులకు సమాజంలో ఉన్నతస్థానం ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వక్తలన్నారు. ఆదివారం పట్టణ బ్రాహ్మణ సంఘం, శ్రీరామమందిర బ్రాహ్మణ సత్రం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో బ్రాహ్మణ కార్తీక వన సమారాధన నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు, అన్నవరం దేవస్థానం కమిటీ మాజీ సభ్యుడు అవసరాల వీర్రాజు అధ్యక్షతన కార్తీక వనసమారాధన జరిపారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సినీ నటుడు జిత్‌మోహనమిత్ర, గుండు సుదర్శనం, ఆశోక్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన మండపేటలో ప్రతియేటా బ్రాహ్మణ కార్తీక వనసమారాధనలో పాల్గొనటం పూర్వ జన్మ సుకృతమన్నారు. మరో నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలు మన అచార వ్యవహారాలకు ప్రతీకలన్నారు. అనంతరం పీసీపీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు డి.సత్యప్రసాద్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, కపిలేశ్వరపురం వేదపాఠశాల ప్రిన్సిపాల్ తంగిరాల దత్తాత్రేయ శర్మ తదితరులతోపాటు పలువురు బ్రాహ్మణ సంఘ నేతలు మాట్లాడారు. రాజమండ్రికి చెందిన సినీనటుడు జిత్‌మోహన్‌మిత్రాను సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖులను సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, అన్నవరం దేవస్థానం మాజీ సభ్యులు కందర్ప హనుమాన్, కడియాల ప్రసాద్, బ్రాహ్మణ సంఘ నాయకులు గరిమెళ్ల నాగేశ్వరరావు, శివకోటి శేషుబ్రహ్మణ్యం, కేసరి విద్యాసాగర్, అవసరాల ధర్మరాజు, ఏడిద సూర్యనారాయణ, బ్రాహ్మణ కుటుంబీకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివదీక్షాదారుల ఊరేగింపు

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శివమాల ధరించిన దీక్షాదారులు జరిపిన ఊరేగింపు ఆకట్టుకుంది. ఆత్రేయపురం మండలం ర్యాలిలో శివదీక్షదారులు మంగళ వాయిద్యాలతో ఆదివారం పలు వీధుల్లో ఊరేగింపు జరిపారు. విభూతిని దేహంపై చల్లుకుని డమురుకాలు, డోలు సన్నాయి వాయిద్యాలతో శివాలంకరణ వాహనం ముందు నాట్యం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. గురుస్వామి నామాల ఏసు ఆధ్వర్యంలో వందలాది శివదీక్షదారులు ఈ పూజల్లో పాల్గొన్నారు. శివనామస్మరణతో ర్యాలి మారుమోగింది.



ర్యాలిలో శివదీక్షాదారుల ఊరేగింపు

సత్యసాయి జన్మదిన వేడుకలు



వాడపల్లిలో హోమం జరుపుతున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు వాడపల్లి శ్రీసత్యసాయి ప్రశాంత నిలయంలో ఆదివారం జరిపారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పంచామృతాభిషేకం, పుష్పార్చన, చండీ, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, లక్ష్మీనారాయణపూజ, మహా నగర సంకీర్తన తదితర కార్యక్రమాలను సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. అధికసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు



వాడపల్లి శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంతో పాటు ఆదివారం సెలవు రోజు కావడంతో పలు శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి, వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి అభిషేకాలు చేశారు. ఆలయాల్లో మహిళలు దీపాలంకరణ జరిపారు. లొల్లలాకుల వద్ద పర్యాటకులు సందడి నెలకింది. గ్రామాల్లోని ఉసిరిచెట్ల వద్ద భక్తులు పూజలు చేశారు. కార్తీక వనసమారాధనలో సహపంక్తి భోజనాలు, ఆటపాటలతో పలువురు సందడి చేశారు.

డీజిల్ తరలిస్తున్న ఆటో సీజ్

ముమ్మిడివరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కుడుపూడి నరేష్, కేతా శ్రీనివాస్‌లు ఆటోలో యానాం నుంచి రూ.80వేలు విలువైన వెయ్యి లీటర్ల డీజిల్‌ను టిన్నుల్లో తరలిస్తుండగా కొండాలమ్మచింత సమీపంలో ఆటోను సీజ్‌చేసి, డీజిల్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

వంతెన ఇలా ఉంటే ఎలా వెళ్లేది..?

• శిథిలావస్థలో ర్యాలి వంతెన • ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల అవస్థలు • చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం



ఆత్రేయపురం మండలం ర్యాలి వంతెనపై ట్రాఫిక్ రద్దీ

ఆత్రేయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పురాతన ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి దేశం నలుమూలల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ర్యాలి వద్ద ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన శిథిలస్థితికి చేరుకున్నా పాలకులు పట్టించుకున్న దాఖలాలేవు. మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు ర్యాలి, అంకంపాలెం, నార్కెడిమిల్లి ప్రాంతాలకు చెందిన వందలాది మంది ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు, బట్టల దుకాణాలకు ముడిసరుకు తీసుకునే వాహనాలతో ప్రతిరోజూ రద్దీగా ఉంటుంది. స్కూల్, కాలేజీ వాహనాలు, ఇతర రాష్ట్రాల పర్యాటకులతో ఈ వంతెన రోజూ రద్దీగా ఉంటుంది. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాలకు తగినట్టుగా లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ జామ్ తలెత్తుతోంది. శిథిలస్థితికి చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

7న మాలల ఆత్మీయ సమ్మేళనం

అమలాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాలల ఐక్యతను చాటుతూ7న జిల్లా స్థాయిలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు దళిత సంఘ నాయకులు డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబూరావు, ఎంఏకే భీమారావు పేర్కొన్నారు. మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు వెదురుపాకలో సామూహిక సత్యదేవుడి వ్రతాలు

రాయవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గీతా మందిరంలో మంగళవారం సామూహిక సత్యదేవుడి వ్రతాలు జరుపుతున్నట్టు గీతా మందిరం నిర్వాహకుడు, ఆధ్యాత్మికవేత్త సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకుని గీతా మందిరంలో గ్రామానికి చెందిన ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మ, అర్చకుడు అంగర జనార్ధనాచార్యులు పర్యవేక్షణలో భక్తులతో సామూహిక సత్యదేవుడి వ్రతాలు జరుగుతాయన్నారు. అనంతరం గీతామందిరంలో కార్తీక వనసమారాధన జరుగుతుందని తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఆత్రేయపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు శనక్కాయల అచ్చమ్మ(102) ఆదివారం మృతి చెందారు. ఈమెకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మనవరాళ్ళు, మునిమనవళ్లు ఉన్నా ఎవరిమీదా ఆధారపడకుండా తన పనులు తాను చేసుకుంటూ తదిశ్వాస విడిచారు.

ఉచిత హోమియో ఆసుపత్రి ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ) నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) రామచంద్రపురం పట్టణంలో చేకూరి పాపారావు. శాంతకుమారి దంపతుల సారధ్యంలో ఆదివారం శిరిడీసాయి హోమియో ఆసుపత్రిని ప్రారంభించారు. తిలక్ ఫంక్షన్ హాలులో పట్టణానికి చెందిన విద్యావేత్త లయన్ జీవీ రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో పాపారావు దంపతులు ఉచిత హోమియో ఆసుపత్రిని ప్రారంభించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హోమియో వైద్యుడు వీపీఎల్ లక్ష్మీ, సీహెచ్ శ్రీనివాసరావు రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అనిల్

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈపీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రామచంద్రపురం డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నున్న అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఆయన్ను డీఈఈ రత్నాలరాజు, ఏఈలు, ఇతర ఉద్యోగులు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.



పసలపూడి వనసమారాధనలో విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఐక్యతకు ప్రతీకలు..కార్తీక వన సమారాధనలు

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రాయవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పసలపూడి గ్రామంలో వేమనరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిపారు. అనపర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీకమాసంలో హరి, హరులను పూజించే విశిష్టమాసంగా పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. తొలుత ఉసిరిచెట్టు వద్ద శివపార్వతులు, లక్ష్మీనారాయణులకు పలువురు పూజలు చేశారు. మహిళలకు, చిన్నారులకు డ్యాన్స్, ముగ్గులు తదితర పలు పోటీలు జరిపారు. యువతులు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలైన మహిళలకు ఎమ్మెల్యే రెండు గ్రాముల బంగారాన్ని అందజేశారు. కార్యక్రమంలో చింతా సుబ్బారెడ్డి, చింతా వెంకటరెడ్డి తదితరులతో పాటు వేమనరెడ్డి సంక్షేమ సేవా సంఘం సభ్యులు, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

● మండలంలోని వెదురుపాక చెరువుగట్టు వద్ద రజకుల కార్తీక వనసమారాధన జరిగింది. రాయవరంలో రెడ్డి మహాజన సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన వన సమారాధనలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

అంతర్వేది, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో అల్లూరి సత్యనారాయణరాజు ఇంటి వద్ద బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వచ్చిందన్నారు. మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు, కొణతం శ్రీనివాసరావు, అల్లూరి సత్యనారాయణరాజు, ఇందుకూరి సుబ్బరాజు, నంబూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐక్యతకు నిదర్శనం వనసమారాధనలు



కుటుంబ సభ్యులతో కలిసి ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం బండారు బుల్లిసత్యం చంద్రావతి కాపు కల్యాణ మండపంలో తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కాపుకార్తీక వనసమారాధన జరిపారు. తొలుత కుటుంబ సభ్యులతో ఆయన ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో కాపు నాయకులు నామన రాంబాబు, ఆకుల రామకృష్ణ, కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పూజలు: కొత్తపేట బోడిపాలెం వంతెన వద్ద విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వారాహి అమ్మవారికి రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, రాజకుమార్ వడయార్, విశ్వమారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో సఖినేటిపల్లివాసి మృతి

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలానికి చెందిన నేతల విద్యాసాగర్ (41) దుబాయ్‌లో రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుండెపోటుతో అతడు మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. విద్యాసాగర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు చిన్న వయసులోనే ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడని తండ్రి వసంతరెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సాగర్ మృతితో సఖినేటిపల్లి మండలంలో విషాదఛాయలు అలముకున్నాయి. విద్యాసాగర్ మృతదేహం మంగళవారం స్వస్థలానికి చేరుతుందని తండ్రి చెప్పారు.

పాసు పుస్తకాలు రద్దు చేయాలి

ద్రాక్షారామ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోర్టు విచారణలో ఉన్న భూములకు రెవెన్యూ అధికారులు జారీ చేసిన పాసు పుస్తకాలు రద్దు చేయాలని కోరుతూ ఆదివారం రామచంద్రపురం మండలం తాళ్లపొలం గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు, ఆయన సోదరి జానకమ్మ మరికొంత మందితో కలసి ధర్నా చేశారు. తాళ్లపొలం ప్రధాన రహదారి పక్కన ఉన్న పొలం విషయంలో తనకు, సోదరిలకు మధ్య వివాదాలతోపాటు కోర్టులో కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ వివాదంలో దొంగల శ్రీధర్ తలదూర్చి కొంత భూమిని తన పేరున, భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉండగా శ్రీధర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములకు తహశీల్దార్ పాసు పుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. పొలం కబ్జాకు యత్నిస్తున్న వారి నుంచి కాపాడాలని డీఎస్పీ కార్యాలయంలో వారు వినతిపత్రం అందించారు.

మద్యం సీసాలు స్వాధీనం

పి.గన్నవరం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): వాడ్రేవుపల్లిలో బెల్ట్‌షాపుపై దాడి చేసినట్లు కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒకర్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ద్రాక్షారామ, నవంబరు. 24(ఆంధ్రజ్యోతి) ద్రాక్షారామ-కోటిపల్లి రోడ్డులో వున్న శ్రీనివాస శైలజ ఐటిఐలో 1991-1993లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమకు విద్యనేర్పిన ప్రస్తుత ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యనారాయణ, పీవీఎస్ ప్రసాద్, అప్పట్లో పనిచేసిన ఉపాధ్యాయులు కారుమూరి చిన్ని, కారుమూరి సుబ్రహ్మణ్యంలను పూర్వపు విద్యార్థులు సత్కరించారు. ప్రస్తుతం ఐటీఐ నిర్వాహకుడు యనమదల శ్రీనివాస్‌ను పూర్వపు విద్యార్థులు సత్క రించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో సుధాకర్, సురేష్ ఎంపీ రామారావు, అంజనేయ ప్రసాద్, శంకర్ గోవిందరాజు శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



రుడా చైర్మన్ వెంకటరమణను అభినందిస్తున్న అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల

అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్లకు

పలువురు అభినందనలు

మండపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు ను ఆదివారం పలువురు కూటమి నాయకులు, అభిమానులు, కుల సంఘాల నాయకులు అభినందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు సారధ్యంలో వ్యాపారులు, సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ మిత్ర బృందంతో అభినందించారు. కపిలేశ్వరపురం మండల జనసేన అధ్యక్షుడు టి.నాగరాజు ఆయన్ను అభినందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూటమి నేతలు, అభిమానులు ఆయన్ను సత్కరించారు.

కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు ముందుకు రావాలి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు ముందుకు రావాలని ఎమ్మెల్యే అన్నారు. ద్వారపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కాకినాడకు చెందిన ఆసుపత్రి మరిచాయే హెల్త్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామానికి చెందిన బి.గోపాలం తనయుడు ప్రసాద్ ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేసిన రోగులకు అవసరమైన మందులను వైద్యులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు, నిర్వాహకులు ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకు లు చింతా దొరబాబు, మాజీ సర్పంచ్ ఎం.వీర భద్రరావు, గోణం వుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణకు పలువురు అభినందనలు: రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణను అంచనాల కమిటీ రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఆదివారం కలిసి అభినందించారు. ఎమ్మెల్యే వేగుళ్లతోపాటు మల్లిపూడి గణేష్ తదితరులు వున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యు రాష్ట్ర నాయకులు

అమరవీరుల పోరాటస్ఫూర్తి సభను విజయవంతం చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యు ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో స్వర్ణోత్సవాలు సందర్భంగా వచ్చేనెల 5న నిర్వహిస్తున్న విప్లవ విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ కోరారు. ఆదివారం క్లాస్ 4 ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో 5న నిర్వహించనున్న సభ పోస్టర్, పీడీఎస్‌యూ 50 ఏళ్ల చరిత్ర, పాటలు, లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 5న నిర్వహించే విద్యార్థి అమరవీరుల పోరాటస్ఫూర్తి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, ఉపాధ్యక్షుడు భానుప్రసాద్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.బీమశంకరం, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కూటమి విజయంపై హర్షం

రామచంద్రపురం(ద్రాక్షారామ) నవంబరు 24, మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి విజయం సాధించటంపై రామచంద్రపురం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేశన రాఘవేంద్రరావు సారధ్యంలో ఆదివారం బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కూటమి విజయంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.హరిబాబు, యాండ్ర బుల్లబ్బు, కులపాకులు వెంకటరమణ, ఖండవిల్లి సత్యనారాయణ ఎం.కృష్ణమూర్తి, రూరల్ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, దనకోటి రెడ్డి, పులిగడ్డ సురేష్, గొర్రెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహారాష్ట్రలో కూటమి విజయంపై సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు